క్లుప్తంగా

బీజేపీలో చేరికలు


బీజేపీలో చేరుతున్న అరవింద్‌రెడ్డి తదితరులు

రేగోడ్(మెదక్): బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, తెలంగాణ ఉద్యమకారుడు అరవింద్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు ఝలక్ ఇచ్చారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సమక్షంలో మంగళవారం బీజేపీలో చేరాడు. ఆయనతో పాటు రాజశేఖర్‌రెడ్డి, వివేక్‌వర్ధన్‌రెడ్డి, ధనుంజయ్‌రెడ్డి తదితరులు బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల నుంచి బీజేపీలోకి భారీగా చేరికలు ఉన్నాయని చెప్పారు. కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చేది బీజేపీ అన్నారు. బీబీ పాటిల్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా రవి


నియామక పత్రం అందుకుంటున్న రవి

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో బీజేపీ మండలాధ్యక్షుడిగా పిల్లుట్ల గ్రామానికి చెందిన పెద్దపులి రవి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనకు నియమక పత్రం మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అందజేశారు. అనంతరం రవి మాట్లాడుతూ.. నాపై నమ్మకంతో పార్టీ మండలాధ్యక్ష బాధ్యతలు అప్పగించిన అధిష్టానానికి, సహకరించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

19 టిప్పర్లపై కేసు నమోదు


నర్సాపూర్‌లో పోలీసులు సీజ్ చేసిన మట్టి టిప్పర్లు

నర్సాపూర్: ఎలాంటి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న 19 టిప్పర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపారు. కొడిపల్లి మండలంలోని ఒక చెరువు నుంచి అనుమతులు లేకుండా నర్సాపూర్ మీదుగా మేడ్చల్ జిల్లాకు మట్టి తరలిస్తున్న 19 టిప్పర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పూర్తి స్థాయి చర్యలు తీసుకునేందుకు రెవెన్యూ, మైనింగ్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని ఆయన తెలిపారు.

ఘనంగా గీతా మందిరం వార్షికోత్సవాలు


పూజలు చేస్తున్న భక్తులు

తూప్రాన్: పట్టణంలోని గీతా మందిరం 16వ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో గణపతి పూజ, స్వస్తివాచనం, రక్షాబంధనం, పంచగవ్య ప్రాసన, యాగశాల ప్రవేశం, మాతృక, ప్రధాన కలశ స్థాపన, గోపాల స్వామికి మహాభిషేకం, స్థాపిత దేవతా హోమాలు, రుద్రహోమాలు, పూర్ణాహుతి, శ్రీరుక్మిణి కృష్ణ కల్యాణం, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహాప్రసాద వితరణ చేశారు.

ముగిసిన మల్లన్న జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో మల్లన్న జాతర మంగళవారంతో ముగిసింది. అందులో భాగంగా చివరిరోజు మంగళవారం ఎల్లమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు, పోతరాజు విన్యాసాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ, మిరుదొడ్డి స్పెషల్ ఆఫీసర్ గణేష్ రెడ్డి కోరారు. సోమవారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇళ్ల మధ్య నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమల నివారణకు ప్రతి వీధిలో ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫహీం తో పాటు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించరా?

అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

అల్లాదుర్గం(మెదక్): అధికారులు కనీసం ప్రొటోకాల్ పాటించరా అని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అల్లాదుర్గం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ దశరథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకం కింద మంజూరు చేసిన సీసీ రోడ్డు పనులను పార్టీ నేతలు శంకుస్థాపనలు చేస్తుంటే.. అధికారులు కనీసం ప్రొటోకాల్ పాటించరా అని ప్రశ్నించారు. పశువైద్య అధికారులు మండల సమావేశానికి రాక పోవడంపై సభ్యులు మండిపడ్డారు. పల్లె ప్రగతిలో పనులు చేయ్యకున్న చేసినట్లు విద్యుత్ కాంట్రాక్టర్లు తప్పుడు రికార్డులు చేసినట్లు వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శంకర్, తహసీల్దార్ సతీశ్, దక్షిణ మధ్య రైల్వే బోర్డు మెంబర్ కాశీనాథ్, పీఆర్‌ఏఈ విజయ్‌గౌడ్, ఇరిగేషన్ ఏఈ తిలక్‌రాజ్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాదాసీదాగా తూప్రాన్ మండల సమావేశం

తూప్రాన్: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మండల వైస్ ఎంపీపీ శరణ్యారెడ్డి అధ్యక్షతన వహించారు. లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా సమావేశంలో సంక్షేమం, అభివృద్ధి పనులు, రాజకీయ అంశాలు ప్రజాప్రతినిధులు అధికారులు ఎవరూ చర్చించ లేదు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషక విలువలపై అధికారులు చర్చించి సమావేశాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అల్లాదుర్గం(మెదక్): మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ రాజమణి


తూప్రాన్ మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్వరరెడ్డి

పౌష్టిక ఆహారంతోనే ఆరోగ్యం


చిన్నశంకరంపేట(మెదక్): ఎస్.కొండాపూర్‌లో గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చిన్నశంకరంపేట(మెదక్): పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా అందరూ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతీ అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.కొండాపూర్, ప్యాటుగడ్డ అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిరు ధాన్యాలు తీసుకోవడంతో కలిగే లాభాలను వివరించారు. ముఖ్యంగా మహిళల్లో వచ్చే రక్తహీనత నివారణకు పౌష్టికాహారం అత్యవసరమన్నారు. ప్రతీ ఒక్కరు ఆరోగ్య రక్షణకు కూరగాయాలు, ఆకుకూరలు, గుడ్లు తీసుకోవడంతో ద్వారా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మి, శారద, శివలక్ష్మి పాల్గొన్నారు.

బాలికలు బలమైన ఆహారం తీసుకోవాలి

చేగుంట(తూప్రాన్): బాలికలు బలమైన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైనీసువర్ణ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని ఉన్నత పాఠశాలలో బాలికలకు రక్తహీనత నివారణ కోసం తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు గ్రామాల్లో అందుబాటులో ఉండే అరటిపళ్లు, ఖర్జూర వంటివి తీసుకోవాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు పోషక ఆహారం తీసుకోవాల్సిన అవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్, అంగన్‌వాడీ కార్యకర్త బాల్‌లక్ష్మి, సురేఖ, ఉమాదేవి, విద్యార్థులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


చేగుంట(తూప్రాన్): మహిళలకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్

తైబజార్ వేలం వాయిదా

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటకు సంబంధించిన తైబజార్ వేలం వాయిదా పడింది. మంగళవారం తహసీల్దార్ గియాసున్నీసా బేగం ఆధ్వర్యంలో తైబజార్ వేలం పాట నిర్వహించగా.. 15 లక్షల 35 రూపాయల పాట వద్ద తైబజార్ వేలం నిలిచింది. గత సంవత్సరం 17 లక్షల 10లకు వేలం జరిగిందని అంతకంటే తక్కువగా ఉన్నందున వేలం వాయిదా వేస్తున్నట్లు ఈఓ భిక్షపతి పేర్కొన్నారు. వేలం పాటలో ఆయా వార్డులకు చెందిన నాయకులు, వ్యాపారులు పేర్కొన్నారు.

22న నార్సింగి తైబజార్ వేలం

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండల కేంద్రంలో ఈ నెల 22న తైబజార్ వేలం పాటను నిర్వహించనున్నట్లు నార్సింగి పంచాయతీ ఈఓ వెంకటేశం తెలిపారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఆసక్తి ఉన్న వారు డిపాజిట్ రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

చెక్‌పోస్టు ఏర్పాటు


తూప్రాన్ - నర్సాపూర్ హైవే పోతారం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

శివ్వంపేట(నర్సాపూర్): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులోకి రావడంతో అధికారులు మంగళవారం చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. తూప్రాన్ - నర్సాపూర్ హైవే పోతారం చౌరస్తా వద్ద భారీ కేట్లతో పాటు తాత్కాలిక షెడ్డు ఏర్పాటు చేశారు. మద్యం, డబ్బు నియత్రించేందుకు నిత్యం ముమ్మరంగా వాహనాలు తనిఖీ చేపట్టానున్నారు. పోతారం చౌరస్తాతో పాటు మరికొన్ని చోట్ల నిఘా కోసం చెక్‌పోస్టుల ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

బ్యాంకు సిబ్బందిపై దాడి

శివ్వంపేట(నర్సాపూర్): బ్యాంకు సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వెంక్యా తండాకు చెందిన బానోత్ తుకారం శివ్వంపేటలోని ఇండియన్ బ్యాంకులో ట్రాక్టర్ కోసం రుణం తీసుకున్నాడు. గత 6 నెలల నుంచి నెలవారి కిస్తీ చెల్లించడంలేదు. రుణం రికవరీ కోసం మంగళవారం ఇండియన్ బ్యాంకు కలెక్షన్ మేనేజర్ సందీప్‌రెడ్డి, సిబ్బంది భూపాల్‌రెడ్డి, సందీప్‌గౌడ్, దత్తయ్య, శ్రీకాంత్, శివకుమార్ వెంక్యా తండాకు వెళ్లారు. బకాయి కిస్తీలు చెల్లించపోవడంతో ట్రాక్టర్‌ని తీసుకురావడానికి ప్రయత్నించగా పలువురు తండా వ్యక్తులు బ్యాంకు సిబ్బందిని అడ్డుకొని వారితో గొడవపడి తిట్టారు. తండాకు చెందిన బానోత్ వినోద్ బ్యాంకు ఉద్యోగి సందీప్‌గౌడ్‌ని కట్టెతో కొట్టి గాయపరిచాడు. బ్యాంకు సిబ్బంది విధులకు ఆటంకం కల్గించడంతో పాటు సిబ్బందిపై దాడి చేసిన బానోత్ వినోద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మానిటరింగ్ కమిటీ సమావేశం

మెదక్: మెదక్ జిల్లా కోర్టు ప్రాంగణంలో మంగళవారం మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జితేందర్ మాట్లాడుతూ.. జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద సూచనల మేరకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్, అడ్వకేట్స్, ప్యానెల్ లాయర్స్‌కి వారి విధులపైన లీగల్ ఎయిడ్, మానిటరింగ్ కమిటీ, న్యాయ సహాయం ఇతర అంశాల పైన సూచనలు ఇచ్చారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అనేది లీగల్ ఎయిడ్ ద్వారా ఉచిత న్యాయ సహాయం, సలహాలు అందిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు పోచయ్య, రామశర్మ, దుర్గారెడ్డి, శోభన్ గౌడ్, నందునాయక్, మధు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మెదక్ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి జితేందర్

కాంగ్రెస్‌లో బీఆర్‌ఎస్ నేతల చేరిక

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కొత్తపేట, సంగారెడ్డిపేట గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధు, సీనియర్ నాయకులు నారాగౌడ్, పెరుమాండ్లగౌడ్, దేవేందర్, సాయిరెడ్డి తదితరులున్నారు.


కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

చింత చెట్టుకు నిప్పు.. తప్పిన ప్రమాదం

పరీక్ష కేంద్రం వద్ద ఘటన

అల్లాదుర్గం(మెదక్): టెన్త్ పరీక్ష కేంద్రం వద్ద చింత చెట్టుకు నిప్పు పెట్టిన సంఘటన మంగళవారం గడిపెద్దాపూర్‌లోని టెన్త్ పరీక్ష కేంద్రం వద్ద చోటు చేసుకుంది. మూడు గంటల వరకు చెట్టుకు మంటలు చేలరెగడంతో విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనకు గురయ్యారు. గడిపెద్దాపూర్ జెడ్పీ పాఠశాల వద్ద వందల ఏళ్ల భారీ చింత చెట్టు ఉంది. ఈ చెట్టు కింద సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మద్యం సేవించారు. మద్యం తాగి సిగరెట్ వెలించుకొని అగ్గిపుల్ల అక్కడే వేయడంతో చెత్తకు మంట అంటుకుంది. ఈ మంటలు చింత చెట్టుకు అంటుకొని మంటలు చేలరెగాయి. ఒకవైపు పాఠశాలలో విద్యార్థులు టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. జోగిపేట నుంచి ఫైర్ ఇంజన్ వచ్చి మంటలు ఆరిన ఫలితం లేకుండా పోయింది. అగ్నిమాపక సిబ్బంది వెళ్లిన తర్వాత మంటలు మళ్లీ చేలరెగి చెట్టు కొమ్మలు విరిగి కింద పడ్డాయి. విద్యార్థులు చెట్టు పక్కనే ఉన్న గదిలో పరిక్షలు రాస్తున్నారు. చెట్టు కొమ్మలు విరిగి బయట పడటంతో ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పిల్చుకున్నారు.


గడిపెద్దాపూర్ పాఠశాల వద్ద చింత చెట్టుకు మంటలు

ఎన్నికల నియమావళి పాటించాలి

అల్లాదుర్గం(మెదక్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రతీ ఒక్కరు ఎన్నికల నియమావళి పాటించాలని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. మంగళవారం ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. గ్రామాల్లో బెల్టు దుకాణాల్లో మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి పత్రాలు లేకుండా రూ. 50 వేల కంటే ఎక్కువ వెంట తీసుకెళ్లితే సీజ్ చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో ఇష్టవచ్చినట్లు ఎదుటి వారిపై వ్యక్తిగతంగా, రాజకీయంగా పోస్టులు పెడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.


ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి

వరి సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన

కొల్చారం(నర్సాపూర్): వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తలతో మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ యాజమాన్య పద్ధతులపై ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం జగిత్యాలకు చెందిన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. ఆయిల్ ఫామ్‌లో తీసుకోవాల్సిన మెలుకువలపై శ్రీ కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ రాజశేఖర్ రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ప్రిన్సిపాల్ సైంటిస్ట్ కవితతో వేసవిలో కూరగాయల పంటలపై వివిధ మందుల వాడకంపై వివరించారు. ఈ కార్యక్రమంలో కొల్చారం ఏఓ శ్వేతా కుమారితో పాటు కొడిపల్లి, పాపన్నపేట ఏఓలు, మండలాల ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.


రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఈఓలు, రైతులు


నార్సింగిలో పోలీస్ కవాతు నిర్వహిస్తున్న పారా మిలటరీ బలగాలు

పోలీస్ కవాతు

చిన్నశంకరంపేట(మెదక్): పార్లమెంట్ ఎన్నికలు సమీస్తున్న నేపథ్యంలో నార్సింగి మండల కేంద్రంలో పోలీస్ కవాతు నిర్వహించారు. మంగళవారం నార్సింగి మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు పట్టణంలోని పలు విధుల్లో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా నార్సింగి ఎస్‌ఐ అమ్మద్ మోహినొద్దీన్ మాట్లాడుతూ.. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎస్పీ బాలస్వామి ఆదేశాలతో పారా మిలటరీ బలగాలతో కవాతు నిర్వహించినట్లు తెలిపారు. శాంతి భద్రతల రక్షణకు పోలీసులు ప్రజాస్వామ్య వ్యవస్థను ముందుకు తీసుకెళ్లేందుకు శాంతియుత వాతావరణం కోసం కృషిచేస్తున్నట్లు చెప్పారు.

మంచినీటి పైప్ కోసేసిన దుండగులు

అల్లాదుర్గం(మెదక్): ప్రజలు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌ను దుండగులు కోసేస్తుండటంతో తాగు నీటికి ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో పాటు మరమ్మతులు చేయడానికి అధికారులకు తలనొప్పిగా మారింది. ఈ సంఘటన మండల పరిధిలోని గడిపెద్దాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి తాగు నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన పైపును గుర్తు తెలియని వ్యక్తులు కోసేస్తున్నారు. వరి పొలాలకు నీటి కోసమే కొందరు కావాలనే పైపును కోసివేస్తున్నట్లు పంచాయతీ అధికారులు చెబుతున్నారు.


గడిపెద్దాపూర్‌లో మంచినీటి పైపు కోసేయడంతో లీకేజీ అవుతున్న నీరు

మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిస్తాం

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్ కలెక్టరేట్: కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ఆశయాలను కొనసాగిస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని కిషన్ భవన్‌లో తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ద్వితీయ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి కామ్రేడ్ మల్లు స్వరాజ్యం ఆశయాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఆనాడు దున్నేవాడికే భూమి కావాలని, వెట్టి చాకిరి విముక్తి కావాలని, మహిళలపై జరుగుతున్న ఆకృత్యాల వ్యతిరేకంగా నిలబడి తుపాకీతో పోరాడిన మల్లు స్వరాజ్యం జీవితం నేటి యువతరానికి ఎంతో ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు సంతోష్, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకులు కిరణ్, నాయకులు జగన్, అజయ్, సత్యం, రాణి, తదితరులు పాల్గొన్నారు.


మెదక్‌లో మల్లు స్వరాజ్యం చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

విఠలేశ్వరాలయ వార్షికోత్సవాలకు సర్వం సిద్ధం

300 సంవత్సరాల పురాతన పాండురంగ క్షేత్రం..

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట మండల కేంద్రంలో కొలువుదీరిన రుక్మిణీ పాండురంగ క్షేత్రం.. భక్తులకు కోరికలు తీర్చే కొంగు బంగారంలా అలరారుతుంది. హరిద్రానదీ ఒడ్డున సుమారు 300 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ మహిమాన్విత దేవాలయం నేటికీ భక్తులతో పూజలందుకుంటున్నది.

పాస్‌పోర్ట్ పాండురంగడు – వీసా విఠలేశ్వరుడు

విదేశాలకు వెళ్దామని కోరిక ఉన్నవాళ్లు స్వామి వారి దగ్గర మొక్కుకొని ప్రయత్నం చేస్తే వారు తప్పక సఫలం అవుతారని ఎందరో ఇక్కడ స్వామివారిని పాస్‌పోర్ట్ పాండురంగడు, వీసా విఠలేశ్వరుడు అని కొలుస్తుంటారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

శోభకృత్ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధ ద్వాదశి, గురువారము రోజున మాసాయిపేట రుక్మిణీ పాండురంగ క్షేత్రం 20వ వార్షికోత్సవాలు నిర్వహించడానికి ముమ్మర ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు ఆలయ నిర్వాహకులు కాసుల హరిరంజనశర్మ తెలిపారు. స్వామి వారికి సుప్రభాత సేవ, గణపతి పూజ, స్వస్తి వాచనం, కలశ స్థాపన, మాతృక, సర్వతోభద్ర, నవగ్రహ మంటపారధన, స్వామివారికి నిజ అభిషేకం, విశేష అలంకరణ జరుగుతాయన్నారు. కుంకుమార్చన, గణపతి, రుద్ర, శ్రీ సూక్త, పురుష సూక్త, స్థాపిత దేవతా హోమం, పూర్ణాహుతి స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. గురు మదనానంద సరస్వతీ పీఠాధిపతులు మాధవానంద సరస్వతీ స్వామి అనుగ్రహ భాషణం అనంతరం భక్త జనులకు తీర్థ ప్రసాదవితరణ, అన్నదానం, నామ సంకీర్తనను నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ఊరేగింపు - నగర సంకీర్తన, హరికథా గేయ వాల్మికీ, బ్రహ్మ శ్రీ రుక్మాభట్ల నరసింహ స్వామివారి హరికథా, భజన, మహామంగళ హారతి కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులు

బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయం

ములుగు(గజ్వేల్): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ బీజేపీ అభ్యర్థి గెలవడం ఖాయమని పార్టీ ములుగు మండల అధ్యక్షుడు మన్నె శ్రీనివాస్ అన్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా మండలంలోని బస్వాపూర్‌లో మంగళవారం ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు నర్సింహులు, మదార్, బాబు, రవీందర్, శ్రీనివాస్, గిరిబాబుతో పాటు తదితరులు పాల్గొన్నారు.